క్లుప్తంగా

అంగన్‌వాడీలలో పోషకాహారం పంపిణీ



పోషకాహారంతో లబ్ధిదారులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం పోషకాహార పంపిణీ నిర్వహించారు. ఆయా కేంద్రాలలోని లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చిక్కీలు అందజేశారు. లబ్ధిదారులకు పోషకాహారం ప్రాముఖ్యం గురించి వివరించారు. ఇంట్లో లభ్యమయ్యే ఆకుకూరలు, పప్పు దినుసులతో తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఎక్కువగా ఆకుకూరలు తినడం ద్వారా శరీరానికి పోషకాలు అంది వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ హైమావతి

మునగపాక : మండలంలోని అరబుపాలెం రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు రాయితీపై ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే సేవలందిస్తున్నామన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయం లాభసాటిగా చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ బొడ్డేడ హైమావతి, వీఏఏ రవిరాజ్, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధరల పెరుగుదలతో పేదలకు భారం



అడ్డురోడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న ముఠా కార్మికులు

ఎస్.రాయవరం: కేంద్ర ప్రభుత్వం పలుమార్లు పెంచిన వంట గ్యాస్ ధరలు సామాన్యులు నెత్తిన భారంలా మారాయని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అన్నారు. అడ్డురోడ్డు కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. 2004 కేంద్రంలో బీజేపీ అధికారంలోనికి వచ్చిన తరువాత ఉండే గ్యాస్ ధర నేటికి మూడు రెట్లు పెరిగిందన్నారు. నిత్యావసర ధరలు కూడా నిత్యం పెరిగిపోతున్నాయన్నారు. పేదలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం ధరలు తగ్గించాలని, లేకపోతే గుణపాఠం తప్పదన్నారు. ఈ నిరసనలో అడ్డురోడ్డు ముఠాకార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఎంపీడీవో సమీక్ష



సంక్షేమ పథకాలపై సమీక్ష చేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులతో వివిధ పథకాలపై గురువారం సమీక్ష చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. పోషకాహార పంపిణీ, పిల్లల ఆరోగ్యం తదితర అంశాలపై అంగన్‌వాడీ, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కరుణ పాల్గొన్నారు.

అన్ని దారులూ ఉపమాక వైపే..

- వెంకన్న సన్నిధికి చేరుకుంటున్న భక్త జనం
- నేటి రాత్రికి జాతర, స్వామికల్యాణం
- తెల్లవారుజాము 2 గంటల నుంచే దర్శనాలు



పుష్కరిణి వద్ద జల్లికట్టు స్నానాల కోసం చేసిన ఏర్పాట్లు



ఆలయంలో భక్తుల దర్శనాల కోసం ఏర్పాటు చేసిన షామియానాలు, షెడ్లు



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ ప్రవీణ్ కుమార్

నక్కపల్లి: ఉపమాకలో జరిగే జాతరలో పాల్గొని వెంకన్న కల్యాణాన్ని తిలకించేందుకు భక్త జనకోటి తరలి వస్తున్నారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా జరగనుంది. ఏకాదశి లగాయతు ఉగాది వరకు ఇక్కడ పెద్ద ఎత్తున జాతర (తీర్థం) జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తులు గురువారం సాయంత్రానికే ఉపమాక చేరుకుంటున్నారు. ప్రత్యేక క్యూకాంప్లెక్సులు, షెడ్లు నిర్మించారు. వారంరోజుల పాటు టీటీడీ వారు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ప్రారంభమైన జాతర శనివారం మధ్యాహ్నం వరకు కొనసాగుతుంది. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులందరికీ ఏకాదశి రోజున వివిధ సేవా సంఘాలవారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నారు. నక్కపల్లి సత్యసాయి సేవాసమితి సభ్యులు భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జల్లికట్టు స్నానానికి ఏర్పాట్లు

బందుర సరస్సు వద్ద స్నాన ఘట్టాలు, మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారి పుష్కరిణిలోజల్లికట్టు స్నానాలకు ఏర్పాట్లు చేశారు.భక్తులు చెరువు లోపలికి వెళ్లకుండా 50 అడుగులమేర రేకుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ మధ్యలోనే భక్తులు స్నానాలు చేసేందుకు షవర్లు ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

ఉపమాక వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆలయం వద్ద బందోబస్తు విధుల కోసం వచ్చిన పోలీసు సిబ్బందితో పరేడ్ నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవ్‌టీజింగ్, దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వామివారికి ఆభరణాలు అలంకరించి తిరువీధి సేవలు రథోత్సవం, ఎదురు సన్నాహ మహోత్సావాలకు తీసుకెళ్లే సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐలు నారాయణరావు, గణేష్, ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

గంజాయిని పూర్తిగా అరికట్టాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గోవింద్, అధికారులు

యలమంచిలి : సెబ్ అధికారులు పనితీరు మెరుగు పరుచుకోవాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. యలమంచిలి పట్టణంలో యువత ఎక్కువగా గంజాయికి బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని, పట్టణంలో గంజాయి ఎక్కువగా స్మగ్లింగ్ జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కొరవడిందని అన్నారు. ఇప్పటి వరకు యలమంచిలి పట్టణంలో ఒక్క గంజాయి కేసు అయినా నమోదు చేశారా? అని గురువారం ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరిగిన యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సెబ్ అధికారుల పై అసహనం వ్యక్తం చేశారు. ఇటీవలే యలమంచిలి పట్టణంలో ఒక యువతిని గంజాయి మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు అతి క్రూరంగా హత్య చేసి కాల్చివేశారని పట్టణంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారని, ఇకనైనా సెబ్ అధికారులు గట్టి నిఘా పెట్టి గంజాయి సేవించే వారిని అరెస్టు చేయాలని అన్నారు. పులపర్తి ఎంపీటీసీ నూకేశ్వరరావు, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహలక్ష్మి, కృష్ణాపురం సర్పంచ్ వర్రె గాంధీ మాట్లాడుతూ డ్వాక్రాలో స్త్రీ నిధి రుణాలను 23 వాయిదాల్లో కట్టాల్సి ఉండగా 24 వాయిదాలు గ్రామ వీవోలు డ్వాక్రా సంఘాల మహిళల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని, దీనిపై సమావేశంలో ఏపీవో రాణిని సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఎంపీపీ గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు సూచించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల నుంచి వీవోలు పొదుపు రూపంలో రూ. 5వేలు చొప్పున వసూలు చేస్తున్నారని, దీనిపై మహిళలకు ఎటువంటి రశీదులు లేకుండా అక్రమ వసూళ్లకు డ్వాక్రా సంఘం అధికారులు పాల్పడుతున్నారని రేగుపాలెం సర్పంచ్ రాజాన మహలక్ష్మి, పులపర్తి ఎంపీటీసీ నూకేశ్వరావు సమావేశంలో అధికారులను నిలదీశారు. దీనిపై అధికారులతో విచారణ జరిపించాలని ఎంపీపీ బోదెపు గోవింద్ ఎంపీడీవో ప్రసాదరావును ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విలేజ్ క్లీనిక్‌లో పాము కాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీటీసీ నూకేశ్వరావు సమావేశంలో కోరారు.

మాధవ్‌కు మద్దతుగా బీజేపీ నేతల ప్రచారం



మాధవ్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీజేపీ శ్రేణులు

అచ్యుతాపురం(అనకాపల్లి): భారతీయ జనతా పార్టీ మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాధవ్‌కు గెలిపించాలంటూ అచ్యుతాపురం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు గురువారం ప్రచారం నిర్వహించాయి. బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల్లోని పట్టభద్రులను కలిసి బీజేపీ శ్రేణులు ఓటుని అభ్యర్థించాయి. గొంతిన భక్తసాయిరాం, రాజాన రాజు, అగ్గాల హనుమంతరావు, మేరుగు కాసుబాబు, పల్లి రాజబాబు పాల్గొన్నారు.

దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



పారంభానికి సిద్ధంగా వున్న దుర్గాంబిక ఆలయం

రాంబిల్లి : కొత్తపేట గ్రామంలో శుక్రవారం దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసారు. దాతల విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయం ప్రారంభం సందర్భంగా గురువారం యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం



సీతంరాజుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ



పంచదార్లలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మునగపాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. గురువారం మునగపాకలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణతో కలిసి పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సేవ చేస్తున్నారన్నారు. విశాఖ త్వరలో పరిపాలనా రాజధానిగా రాబోతుందన్నారు. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యావంతులు మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ పాల్గొన్నారు.

పంచదార్లలో ప్రచారం

రాంబిల్లి : ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎంపీపీ జి.శిరీష‌శ్రీనుబాబు, ధూళి నాగరాజు , రాంబిల్లి మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ కోరారు. పంచదార్లలో గురువారం శిరీష శ్రీనుబాబు, నాగరాజు తదితరులు ప్రచారం నిర్వహించారు. వాడ నర్సాపురంలో మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ కారె రామారావు తదితరులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

'స్కై స్పోర్ట్స్' వ్యాప్తికి కృషి

తుమ్మపాల : స్కై స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ క్రీడను జిల్లాలో అందుబాటులోకి తీసుకొస్తామని అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రెసిడెంట్ వనం సన్యాసిరావు అన్నారు. అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో గురువారం నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్రీడను జిల్లా వ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో స్కై స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో అనేక చోట్ల ఉచిత క్రీడా శిబిరాలను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కొత్తూరు రమేష్, ఎం.రాజు, జి.దేవివరలక్ష్మి, రాజాన వెంకట నాగఅప్పారావు, కరణం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



గొట్టివాడ శివారున ప్రమాదకర మలుపు

కోటవురట్ల : మండలంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో మలుపులు ప్రమాదాలను రారమ్మంటున్నాయి. వాహనాల రద్దీ, అతివేగం వెరసి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదకరమైన మలుపులకు తోడు చాలా కాలంగా జంగిల్ క్లియరెన్సు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నర్సీపట్నం మండలం పెద బొడ్డేపల్లి జంక్షన్ నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిలో పలు చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. పాతరోడ్డు జంక్షన్ నుంచి గొట్టివాడ శివారు వరకు ఉన్న పలు మలుపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణంలోని లోపాల కారణంగా వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ మలుపుల్లో పలువురు ప్రమాదాలకు గురై డెడ్ స్పాట్‌లుగా మారాయి. రామచంద్రపురం, కైలాసపట్నం, చౌడువాడ, రాజుపేట, ఎల్.వి.కె.రోడ్డు, అన్నవరం, బోడపాలెం రహదారుల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి.

జంగిల్ క్లియరెన్సు లేక..

రోడ్లకిరువైపులా ఏళ్ల తరబడి జంగిల్ క్లియరెన్సు లేకపోవడంతో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ రహదారులన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయి. అసలే ఇరుకు రోడ్లు కాగా పిచ్చిమొక్కలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు స్పందించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రహదారి నిర్మాణంలో మార్పులు తీసుకురావాలని, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. మలుపుల వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని చెబుతున్నారు.

మలుపుల్లో ప్రమాదాలను నివారించాలి



మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాతరోడ్డు జంక్షన్ నుంచి గొట్టివాడ గ్రామం వరకు ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతాలలో రోడ్డు పల్లంగా ఉండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల్లో రోడ్డును సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

–ఆర్.ఎస్.సత్యనారాయణరాజు, తంగేడు

జంగిల్ క్లియరెన్సు చేయించాలి



జంగిల్ క్లియరెన్సు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజుపేట రహదారిలో చాలా మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్సు చేయించాలి.

– కె.గోపాలకృష్ణ, రామన్నపాలెం

సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : మునగపాక మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి సహకరించాలన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పలువురు సర్పంచ్‌లు తమ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించడంతో పాటు పెండింగ్ బిల్లులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. అనంతరం అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని సభలో చదివి వినిపించారు. ఎంపీడీవో రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, వైస్ ఎంపీపీలు బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, చిందాడ దేవి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు కోనపల్లి రామ్మోహనరావు, మళ్ల ఉమామహేశ్వరరావు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు మరిసా రమణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఆడపిల్లను ఎదగనిద్దాం అంటూ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం : ఆడపిల్లను కాపాడి సమాజ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. సర్వసిద్ధి గ్రామంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్ల ఇంటికి వెలుగు అని, కుటుంబాల్లో ఆడపిల్ల భారం అని భావించే తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లల ఆరోగ్యానికి ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తున్నదని తెలిపారు. దానికి పూర్తి స్థాయిలో వినియోగించుకుని ఆరోగ్యకరంగా ఆడపిల్లలను పెంచాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా పోషకాహారం తీసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హెల్త్ అసిస్టెంట్ పి.ఎన్. వి.ఎస్ ప్రసాద్, విజిటర్ సీహెచ్ రమణ, సచివాలయం హెల్త్ సెక్రటరి పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

పోషకాహారం సక్రమంగా అందించాలి



కొత్తపోలవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం:ప్రభుత్వాలు అందిస్తున్న పోషకాహర వస్తువులను లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని ఎంపీడీవో ఎన్.వి. రామచంద్రమూర్తి సూచించారు. కొత్తపోలవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కేంద్రానికి వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి నెలా కేంద్రం నుంచి అందిస్తున్న సరుకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో కేంద్రం తెరచి చిన్నారులకు పోషకాహారం ఇవ్వడంతో ఎల్‌కేజీ పాఠాలు బోధించాలని సూచించారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి అనుపు మహోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మార్టూరు గ్రామంలో గురువారం నూకాంబిక అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పండగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనుబాబు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉచిత మెగా గుండె వైద్య శిబిరం నేడు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో శుక్రవారం ఉచిత మెగా గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. విశాఖపట్నంకు చెందిన అను న్యూరో , కార్డియాక్ సైన్సెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అవగాహన సదస్సు

పాయకరావుపేట : ఉద్యోగుల స్టేట్ ఇన్సూరెన్సు (ఇఎస్ఐసీ) ఉపయోగాలు, ఆన్‌లైన్‌లో వివరాలు ఎలా పొందుపరచాలి.....దీనిపై ఉద్యోగులలో ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. 71వ ఇఎస్ఐసి (ఫిబ్రవరి 24 నుండి మార్చి 10 వరకు) ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలలో భాగంగా పాయకరావుపేట, తుని జంట నగరాలలో ఇఎస్ఐసీ లబ్ధి పొందుతున్న వారందరికీ పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ విద్యా సౌధంలో ఈనెల 4వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు జరగనుందని అనకాపల్లి డీసీబీవో బ్రాంచ్ మేనేజర్ ఎస్. రాజీవ్ తెలిపారు. ఈ సదస్సుకు తుని, పాయకరావుపేటకు చెందిన ఇఎస్ఐసీ లబ్ధిదారులంతా హాజరవాలని కోరారు.

ముగిసిన మండల సమావేశం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం సాధారణంగా ముగిసింది. మండలంలో జరుగుతున్న అభివృద్ధి గురించి విభాగాల వారీగా ఆరా తీశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్త నిధులు, నూతన పథకాల అంశాల జోలికి వెళ్లకుండా జరుగుతున్న అభివృద్ధి పైనే చర్చించారు. ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

6న పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ట

మునగపాక : రామారాయుడుపేటలో ఈ నెల 6న పరదేశమ్మతల్లి ఆలయ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల సహకారంతో నిర్మించనున్న ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. అదే రోజు మధ్యాహ్నం 12గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందని భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి డిప్యుటేషన్ రద్దు చేయాలి

మునగపాక : పల్లపు ఆనందపురం పంచాయతీ కార్యదర్శి సమీహ డిప్యుటేషన్ రద్దు చేయాలని కోరుతూ గురువారం ఎంపీడీవో రవికుమార్‌కు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వినతి పత్రం అందజేశారు. ఏకగ్రీవ తీర్మానం చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రవికుమార్‌ను కలిశారు. పల్లపు ఆనందపురం పంచాయతీ కార్యదర్శి సమీహ ప్రజా ప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వడం లేదని, అంతేకాకుండా హేళన చేస్తున్నందున ఉన్నతాధికారులు ఆమె డిప్యుటేషన్ రద్దుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణతో ఆమె ప్రవర్తించిన తీరు బాధాకరమన్నారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం

కోటవురట్ల : మండలంలోని బయ్యవరంలో శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరపనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుపుతామన్నారు. అదేవిధంగా రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్ర కథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేయడంతో పాటు బాణసంచా వెలిగించనున్నట్టు పేర్కొన్నారు.